నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, బుధవారం 4 జూన్ 2025 | MAHABUBNAGAR NARAYANPET

అమెరికా పర్యటనలో ఉన్న కేటీఆర్‌తో కొత్త తండా విద్యార్థి సికిందర్

అమెరికాలో కేటీఆర్‌ను కలిసిన విద్యార్థి

వెల్దండ, జూన్ 3 : అమెరికా పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నాగర్‌కర్నూల్ జిల్లా కొత్త తండాకు చెందిన విద్యార్థి ఇస్లావత్ సికిందర్ కలిశారు. సోమవారం యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ డాలస్‌లో చదువుకుంటున్న విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్‌ను సికిందర్ మర్యాదపూర్వకంగా కలవడంతో ఆప్యాయంగా పలకరించినట్లు విద్యార్థి తెలిపాడు. కేటీఆర్‌ను కలవడం ఎంతో ఆనందంగా ఉన్నదన్నారు.

హరీశ్‌రావును సన్మానిస్తున్న గోళి శ్రీనివాస్‌రెడ్డి

హరీశ్‌రావును కలిసిన శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ, జూన్ 3 : రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. హరీశ్ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని గోళి శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు సుభాష్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రాజోళి మండలంలోని వివిధ గ్రామాల రైతులు

ఇథనాల్ ఫ్యాక్టరీ మాకొద్దంటూ..

- **పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు ప్రారంభించిన యాజమాన్యం**
- **రాత్రికి రాత్రే కంటైనర్లు, ప్రైవేట్ సిబ్బందిని దింపిన వైనం**
- **పనులు నిలిపివేయాలని రైతుల డిమాండ్**

రాజోళి, జూన్ 3 : రైతులకు హాని చేసే ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని కొన్ని నెలలుగా అడ్డుకుంటూనే ఉన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, పాలక ప్రభుత్వ పెద్దలు హామీలతో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం అగిపోయిందనుకున్న పెద్ద ధన్వాడ గ్రామ ప్రజలతోపాటు 12 గ్రామాల ప్రజలకు ఆ కంపెనీ యాజమన్యం పెద్ద షాక్ ఇచ్చింది. సోమవారం అర్ధరాత్రి గ్రామస్తులు గాఢనిద్రలో ఉన్న సమయంలో ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రాంతంలో గుట్టు చప్పుడు కాకుండా కంటైనర్, జేసీబీలను, కొంతమంది ప్రైవేట్ సిబ్బందిని ఆ కంపెనీ యాజమాన్యం దింపింది. మంగళవారం ఉదయం కొంతమంది రైతులు అటుగా వెళ్తు వాటిని గమనించి చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు సమాచారం ఇచ్చి ఫ్యాక్టరీ నిర్మాణం చెపట్టే రాహదారిలో బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గతంలో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మండలానికి చెందిన రైతులు ముక్తకంఠంతో ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశామన్నారు. నెలరో జులు నిరాహార దీక్షలు చేసి రైతులకు అండగా ప్రభుత్వం, అధికారులు నిలవాలని కోరినా పాలక ప్రభుత్వం అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ హామీతో దీక్షలు విరమించామని ఇప్పుడు ఫ్యాక్టరీ యాజయాన్యం చెప్పాపెట్టాకుండా పనులు ప్రారంభించేందుకు పూనుకోవడం మంచిది కాదన్నారు. ఇప్పటి వరకు ఫ్యాక్టరీపై శాంతియుతంగానే నిరసనలు చేశామని రైతుల సహనాన్ని పరీక్షిస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో కొంత మంది రైతులు పాలక ప్రభుత్వ పెద్దలతో చేతులు కలిపి ఫ్యాక్టరీ ఏర్పాటుకు సహకరిస్తూ రైతుల కడుపుకొడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం అడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలపైకి మంది మార్బాలం ఉందని గుండాలను దింపినా ఉద్యమాలు ఆగవని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం, కాంగ్రెస్ పెద్దలు ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయకుండా తగిన చర్యలు తీసు కోవాలని, లేదంటే ప్రజలకు అండగా నిలవని నాయకులకు తగిన రీతిలో బుద్ధిచెబుతామని హెచ్చరించారు.

అయితే రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నా ఎవరూ స్పందించకపోవడంతో ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు కోసం భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని, త్వరలో దీనికి సంబంధించిన కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పి రైతులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

> ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. మరో వారం రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానుండగా.. విద్యాసంస్థలకు చెందిన బస్సులకు ఫిట్‌నెస్ పరీక్ష చేయించడంలో ఆసక్తి చూపడం లేదు. ఐదు జిల్లాల్లో కలిపి మొత్తం 1383 స్కూల్ బస్సులు ఉండగా.. ఇప్పటి వరకు కేవలం 335 బస్సులకే ఎఫ్‌సీ(ఫిట్‌నెస్ సర్టిఫికెట్) రెన్యూవల్ చేయించాయి. ఇంకా 1048 బస్సులకు చేయించాల్సి ఉన్నది. ఈ పరీక్షలు చేయించకుండా విద్యార్థుల భద్రతపై, జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయి. అయితే ఈనెల 12లోగా బస్సులన్నింటికీ సామర్థ్య పరీక్షలు చేయించాలని రవాణా శాఖాధికారులు సూచిస్తున్నారు.
>
> – మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 3

ఫిట్‌లెస్

- **మరో వారంలో స్కూళ్ల ప్రారంభం**
- **నేటికీ 25 ప్రైవేటు బస్సులకే ఫిట్‌నెస్**
- **నిర్లక్ష్యంగా స్కూల్ యాజమాన్యాలు**
- **భద్రతపై దృష్టి సారించని వైనం**
- **విద్యార్థుల జీవితాలతో చెలగాటం**
- **12లోగా సామర్థ్య పరీక్ష చేయించాలి : ఉమ్మడి జిల్లా ఉప రవాణా శాఖాధికారి**

జిల్లా	స్కూల్ బస్సులు	ఫిట్‌నెస్ అయినవి
మహబూబ్‌నగర్	472	107
నాగర్‌కర్నూల్	273	50
గద్వాల	244	53
వనపర్తి	242	70
నారాయణపేట	152	55
మొత్తం	1383	335

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు (ఎఫ్‌సీ) రెన్యూవల్ చేయించుకునే విషయంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు నిరాసక్తంగా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 75శాతం స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోలేదు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1383 స్కూల్ బస్సులు ఉన్నాయి. కాగా వాటిలో ఇప్పటి వరకు కేవలం 335 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు రెన్యూవల్ చేయించారు. 1048 బస్సులకు ఇంతవరకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు రెన్యూవల్ చేయలేదు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కావడానికి వారం రోజుల వ్యవధి ఉన్నది. ఇప్పటికే ప్రైవేట్ పాఠశాలలు ఇబ్బడి ముబ్బడిగా ప్రకటనలు చేస్తూ విద్యార్థులను ఆకట్టుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. గల్లి గల్లి తిరుగుతూ, తమ విద్యా సంస్థల గురించి ప్రచారం చేస్తున్నాయి. విద్య పేరు చెప్పి రూ.లక్షలు దండుకోవాలన్న ధ్యాస తప్పా విద్యార్థులకు తగిన భద్రత కల్పించాలన్న ఆలోచన విద్యా సంస్థల యాజమాన్యాలకు లేదన్న విమర్శలున్నాయి. ఇదే నేపథ్యంలో పిల్లల చదువుల కోసం ఎంత ఖర్చుకైనా తల్లిదండ్రులు వెనుకాడటం లేదు. విద్యా సంస్థల్లో వసతులు, బోధన సిబ్బంది గురించి ఆరా తీస్తారు. కానీ వాటికంటే ముఖ్యమైన విషయం రవాణా సౌకర్యం గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. పాఠశాలల హంగులు, ఆర్భాటాలు చూసి మోసపోయే ప్రమాదముంది.

గతంలో ఎన్నో ప్రమాదాలు

జిల్లాలో స్కూల్ బస్సుల పరిస్థితి చాలా దారుణంగా ఉన్నది. అనేక కార్పొరేటు, ప్రైవేట్ పాఠశాలల బస్సుల్లో సీట్లు చిరిగిపోయి, దుమ్ము ధూళి పేరుకు పోయి, ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో మందులున్నా లేక పోయినా.. ఉన్న మందులు కాస్తా గడువు దాటిపోయినా పట్టించుకోకుండా లాభార్జనే ధ్యేయంగా చూసుకుంటున్నాయి విద్యాసంస్థల యాజమాన్యాలు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందలాది పాఠశాలల్లో ఇదే పరిస్థితి. డబ్బులు వసూళ్లు చేయడంలో ఉన్న శ్రద్ధ ప్రమాణాలు పాటించడంలో చూపించడం లేదు. వీరికి ఇటు విద్యాశాఖాధికారులు, అటు రవాణా శాఖాధికారులు వత్తాసు పలుకుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిట్‌నెస్ లేని కారణంగా గతంలో ఎన్నో చోట్ల విద్యార్థులు ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. విద్యార్థులను క్షేమంగా ఇంటికి చేర్చే విద్యా సంస్థల బస్సు ఫిట్‌నెస్, అనుభవజ్ఞులైన డ్రైవర్లు, నిబంధనల మేరకు వాహనం ఉందా? అన్నది తల్లిదండ్రులు చూడాలి. బస్సు డ్రైవర్లు బాధ్యతా యుతంగా విద్యార్థులను క్షేమంగా ఇంటికి చేర్చుతున్నారా? అనే అంశాలను పాఠశాల యాజమాన్యం పరిగణనలోకి తీసు కోవాలి.

ఉమ్మడి జిల్లాలో ఫిట్‌నెస్ ఇలా..

మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 472 బస్సులు ఉండగా వాటిలో 107 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో 273 బస్సులకు కేవలం 50 బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు పొందాయి. జోగుళాంబ-గద్వాల జిల్లాలో 244 బస్సులకు గానూ 53 బస్సులకు, వనపర్తి జిల్లాలో 242 బస్సులకు 70, నారాయణపేట జిల్లాలో 152 బస్సులకు గానూ 55 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఉన్నాయి.

ఫిట్‌నెస్ రూల్స్..

15 సంవత్సరాలు నిండిన వాహనాలను స్టూడెంట్స్ రవాణాకు ఉపయోగించకూడదు. స్కూల్ బస్సు పూర్తి కండిషన్‌లో ఉండాలి. విద్యా సంస్థ పేరు, సెల్‌ఫోన్, ల్యాండ్ ఫోన్ నెంబరు, పూర్తి అడ్రస్ బస్సు ఎడమవైపు, ముందు భాగంలో స్పష్టంగా కనిపించేలా రాయాలి. ప్రతి విద్యా సంస్థ యాజమాన్యం డ్రైవర్ ఆరోగ్య పట్టిక నిర్వహించాలి. డ్రైవర్ షుగర్, బీపీ, కంటిచూపు వంటి ప్రాథమిక పరీక్షలను ప్రతి 3 నెలల కోసారి చేయించాలి. డ్రైవర్‌కు 5 ఏండ్ల అనుభవం తప్పనిసరి ఉండాలి. ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉండాలి. ముఖ్యంగా విద్యార్థులు కూర్చునేందుకు అనువుగా సీట్లు ఉన్నాయా.. లేవా? చూసుకోవాలి. అత్యవసర ద్వారం (ఎమెర్జెన్సీ ఎగ్జిట్) ఉండాలి. దానిపై స్పష్టంగా అత్యవసర ద్వారం అని రాసి ఉండాలి. బస్సుకు సంబంధించిన వైపర్స్, విండ్ స్క్రీన్, పార్కింగ్ లైట్స్, లైటింగ్స్ ఉండాలి. బస్సు టైర్లు కూడా కండిషన్‌గా ఉండాలి. ప్రతి బస్సులో మంటలు ఆర్పే పరికరాలు ఉండాలి. డ్రైవర్‌కు విద్యార్థులు బస్సు ఎక్కడం, దిగడం స్పష్టంగా కన్పించే విధంగా అద్దాలు అమర్చుకోవాలి. ప్రతి బస్సులో అటెండర్ ఉండాలి. బస్సులో ప్రయాణిస్తున్న స్టూడెంట్స్ పట్టిక ఉండాలి. బస్సులో స్టూడెంట్స్ బ్యాగులు పెట్టుకొనే విధంగా అరలు ఏర్పాటు చేయాలి. కిటికీలకు మధ్యలో లోహపు కడ్డీలు కచ్చితంగా ఉండాలి. ఫుట్‌బోర్డుపై మొదటి మెట్టు భూమికి 325 మిల్లీమీటర్ల ఎత్తు మించకుండా చూడాలి. అన్ని మెట్లు జారకుండా లోహంతో నిర్మించాలి. బస్సులో ఆకస్మాత్తుగా అగ్ని ప్రమాదం జరిగితే, తక్షణమే మంటలు ఆర్పేందుకు కార్బన్‌డై ఆక్సైడ్ (సీవో2) రసాయనం నింపిన ఎరుపు రంగుతో కూడిన సిలిండర్ డ్రైవర్‌కు అందుబాటులో ఉండాలి. డ్రైవర్ సీటుకు వెనుకాల విధిగా ప్రథమ చికిత్స పెట్టె (ఫస్ట్ ఎయిడ్ బాక్స్) ఉండాలి. అందులో అత్యవసర సమయంలో చికిత్స చేసేందుకు అనువైన 26 రకాల మందులు, గాయాలకు కట్టుకట్టడం కోసం దూది, బ్యాండేజ్ ఉండాలి. ముఖ్యంగా డ్రైవర్, క్లీనర్లు యూనిఫాం ధరించాలి. విధుల్లో మద్యం తాగరాదు.

యాజమాన్యాల బాధ్యతలు..

బస్సు డ్రైవర్, సహాయకుడి ఫొటో, లైసెన్స్ వివరాలను అందరికీ తెలిసేలా బస్సు లోపల బోర్డు పెట్టించాలి. విద్యార్థులను ఎక్కించి, దింపేందుకు ప్రతి బస్సుకు ఒక సహాయకుడిని ఏర్పాటు చేయాలి. రోజూ బస్సు వెళ్లే మార్గాన్ని (రూట్ మ్యాప్) బస్సులో అతికించాలి. తప్పనిసరిగా బస్సులను పాఠశాల ఆవరణలోనే పార్కింగ్ చేయాలి.

బడులు తెరిచేలోగా ఫిట్‌నెస్ చేయించాలి

విద్యాసంస్థల ప్రారంభం ఈనెల 12లోగా బస్సులన్నింటినీ సామర్థ్య పరీక్షలు చేయించాలి. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. తనిఖీలు ముమ్మరం చేస్తాం. పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు జరిమానా విధిస్తాం. పరీక్షలకు రాని బస్సులకు సంబంధించి యజమానులకు నోటీసులు పంపిస్తాం. తల్లిదండ్రులు సైతం కచ్చితంగా బడి బస్సు గురించి వాకబు చేయడంతో పాటు వాటి సమగ్ర వివరాలు సేకరించాకే విద్యార్థులను ఆయా పాఠశాలల్లో చేర్పించాలి. నిబంధనలు పాటించని పాఠశాలల్లో అడ్మిషన్లు పొందకూడదు.

- కిషన్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఉప రవాణాశాఖ అధికారి

- **ధరూర్‌లో ట్యాంక్ ఎక్కి నీటిని తెచ్చుకుంటున్న జనం**
- **నిలిచిన మిషన్ భగీరథ నీటి సరఫరా**
- **పట్టించుకోని అధికారులు**
- **ఇబ్బందులు పడుతున్న ప్రజలు**

తాగునీటికి తండ్లాట

కొత్తపాలెంతండాలో వ్యవసాయ పొలం నుంచి నీటిని తెచ్చుకుంటున్న తండావాసులు

ధరూరు, జూన్ 3 : మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితి మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకున్నది. సోమవారం మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్‌లో యంత్రాలు శుద్ధి చేయడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. మంగళవారం కూడా నీటిని సరఫరా చేయకపోవడంతో ప్రజలు ఖాళీ బిందెలను పట్టుకొని సమీప వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో కొంత మంది ఏకంగా ఓవర్ హెడ్ ట్యాంక్‌పైకి ఎక్కి బిందెలతో నీళ్లు తెచ్చుకోవడం కనిపించింది. ఏదీ ఏమైనా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా మిషన్ భగీరథ నీటి సరఫరాను నిలిపివేయడం సరికాదని ప్రజలు మండిపడుతున్నారు. దీనిపై ధరూర్ పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్ శుద్ధి చేయడం వలన నీటి సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. అయితే ప్రజలు ఇబ్బంది వుంటే మాకు తెలిపితే వాటర్ ట్యాంక్‌తో నీటిని సరఫరా చేసేవారమని, అలా ట్యాంకులు ఎక్కి ప్రాణాపాయం తెచ్చుకోవద్దని ప్రజలకు సూచించారు. అదేవిధంగా మండలంలోని కొత్తపాలెంతండాలోనూ మూడు రోజులుగా ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎంపీవోను వివరణ కోరగా తండాలో పైప్‌లైన్ మరమ్మతులకు కావడంతో తాగునీటి ఎద్దడి ఏర్పడిందని, మరమ్మతులు చేసి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

సఫారీ యాత్రికులకు కనిపించిన పులి

గుండం సమీపంలో సఫారీలో కన్పించిన పులి

అమ్రాబాద్, జూన్ 3 : నల్లమల ప్రాంతంలోని అమ్రాబాద్‌టైగర్ రిజర్వు పరిధిలోని ఫర్హాబాద్ గుండం సమీపంలో సఫారీ యాత్రికులకు మంగళవారం పులి కన్పించింది. సఫారీలో భాగంగా అడవిలో యాత్రికులకు పులి కన్పించడంతో యాత్రికులు సంతోషం వ్యక్తం చేశారు. ఏటీఆర్‌లో పెద్దపులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని సఫారీలో ఇప్పటికి దాదాపు నాలుగైదు సార్లు పులి కన్పించిందని జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్‌గోపిడి తెలిపారు.

అర్ధరాత్రి మొసలి కలకలం

గద్వాల అర్బన్, జూన్ 3 : అర్ధరాత్రి మొసలి కలకలం సృష్టించిన ఘటన సోమవారం అర్ధరాత్రి జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని హమాలీ కాలనీలో సోమవారం అర్ధరాత్రి కాలనీలోకి మొసలి ప్రవేశించడంతో కాలనీలో ఉన్న కుక్కలు పెద్ద ఎత్తున అరిచాయి. దీంతో స్థానికులు లేచి చూడగా మొసలి కనబడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అందరూ కలిసి తాళ్ల సాయంతో మొసలిని బంధించి అటవీ అధికారులకు సమాచారం వారు వచ్చి మొసలిని పట్టుకొని నదిలో వదిలేసినట్లు తెలిపారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న కమిషనర్

- **మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పీఏ నుంచి బెదిరింపు కాల్**

నిర్మాణ పనులను నిలిపివేయాలని చూపిస్తున్న కమిషనర్

అమరచింత, జూన్ 3 : అమరచింత మున్సిపాలిటీలో ఓ వ్యక్తి పురపాలిక అనుమతి లేకుండా ఇంటి నిర్మాణ పనులు చేయడం తోపాటు డ్రైనేజీని సైతం ఆక్రమించడంతో మున్సిపల్ కమిషనర్ రవి బాబు నిర్మాణ పనులు అడ్డుకున్నాడు. దీంతో మున్సిపల్ కమిషనర్‌కు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పీఏ వెంకటేశ్ ఫోన్ చేసి బెదిరించిన ఘటన మంగళవారం చోటు చేసుకున్నది. మున్సిపల్ కమిషనర్ రవి బాబు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో తోకలి శంకర్ అనే వ్యక్తి మున్సిపల్ అధికారుల అనుమతి లేకుండా ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టారు. అంతేకాకుండా రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీని సైతం కూల్చి అందులో పిల్లర్ వేసి పనులు చేపడుతుండడంతో కాలనీవాసుల సమాచారం మేరకు వార్డు ఆఫీసర్‌తో కలిసి వెళ్లి ఇంటి నిర్మాణానికి సంబంధించిన అనుమతి చూపించాలని కోరానన్నారు. అయితే అమరచింత గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడే ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకున్నానని చెప్పడంతో ప్రభుత్వ నిబంధనలు అతిక్రించినట్లు భావించి షోకాజ్ నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో పనులు నిలిపివేసిన యజమాని మంగళవారం కూల్చివేసిన డ్రైనేజీపై మళ్లీ రెండు ఫీట్ల వరకు గోడ నిర్మించడంతో తాము వెళ్లి కాలనీవాసులకు ఇబ్బంది కలిగేలా ఉన్న నిర్మాణాన్ని ఆపాలని సూచించినట్లు చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పీఏ వెంకటేశ్ తనకు ఫోన్ చేసి మా అనుమతి లేకుండా అక్కడికి ఎందుకు వెళ్లావని, తక్షణమే అక్కడి నుంచి వెళ్లకపోతే నిన్ను ఇక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ చేయిస్తానని ఫోన్‌లో బెదిరించడంతో వెనుదిరిగి వచ్చినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చి వారి ఆదేశాల అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటానని మున్సిపల్ కమిషనర్ వెల్లడించారు.

అడవిపందుల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

ఊర్కొండ, జూన్ 3 : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో చోటు మంగళవారం చోటు చేసుకున్నది. ఎస్సై కృష్ణదేవర తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని జకినాలపల్లికి చెందిన బోయ జంగయ్య (35) అదే గ్రామానికి చెందిన అమ్మపల్లితండావాసులతో కలిసి ఆడవిపందుల వేట కోసం గ్రామ శివారులో విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారు. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ కాలుకు తగలడంతో జంగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది గమనించి తోటి వ్యక్తులు భయబ్రాంతులకు గురై అక్కడి నుంచి పారిపోయారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడికి భార్య ముగ్గురు కూతుర్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

- **పాతబజార్‌కు రోడ్డు ఉందంటూ ఎన్‌హెచ్ అధికారి స్పష్టం**
- **నాలిక కరుచుకున్న కాంగ్రెస్ నాయకులు**

అనుకున్నదొక్కటి.. అయినదొక్కటి..

జడ్చర్ల టౌన్, జూన్ 3 : 167వ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా జడ్చర్లలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి పాతబజార్‌కు రహదారి విషయంలో కాంగ్రెస్ నాయకులు గందరగోళం సృష్టించి పట్టణవాసులకు అయోమయంలో పడేద్దామనుకొని మంగళవారం జడ్చర్లలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పాతబజార్‌కు రహదారి ఉందన్న విషయంపై మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చెప్పిన విషయాలు అబద్ధం అంటూ చెప్పే క్రమంలో అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు విలేకరుల ఎదుటే జాతీయ రహదారుల సంస్థ అధికారి రవికుమార్‌కు ఫోన్‌చేసి స్పీకర్ ఆన్ చేసి మాట్లాడారు. ఈ తరుణంలో సదరు అధికారి రవికుమార్ మాట్లాడుతూ పాతబజార్‌కు రహదారి ఉందని, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలియజేసిన వివరాలు వాస్తవమేనని చెప్పుకురావటంతో అక్కడున్న కాంగ్రెస్ నాయకులు నాలిక కరుచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అక్కడున్న విలేకరులు, నాయకులు గుసగుసలాడుకోవాల్సి వచ్చింది. గత కొన్ని రోజులుగా జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అంబేద్కర్ చౌరస్తా నుంచి పాతబజార్‌కు రహదారి లేదంటూ కొందరు అపోహ సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్పందించి సోమవారం జడ్చర్లలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి అంబేద్కర్ చౌరస్తా నుంచి యథావిధిగా పాతబజార్‌కు రహదారి ఉన్నట్లు జాతీయ రహదారి సంస్థ ఇచ్చిన డిజైన్(మ్యాప్) ద్వారా వివరించటం జరిగింది. పాతబజార్‌కు రహదారి విషయంలో పట్టణవాసులు ఎలాంటి కన్ఫ్యూజన్ కాకూడదని తెలియజేయటం జరిగింది. ప్రజల బాగుకోసం పని చేయాలి తప్పా అన్నిట్లోనూ రాజకీయాలు చేయడం సరికాదని ఆయన హితవు పలికారు. అయినా పట్టణానికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు పాతబజార్ రహదారి విషయంలో రాజకీయాలకు తెర లేపుదామనుకుందామనుకున్నారేమో కానీ జాతీయ రహదారి సంస్థ అధికారి ఫోన్‌లో వాస్తవాలు చెప్పటంతో మిన్నకుండిపోయారు. ఈ పరిస్థితిలో ఏదో ఒకటి మాట్లాడక తప్పదు అనుకొని పాతబజార్ రోడ్డు విషయంలో అధికారులకే స్పష్టత లేదంటూ చెప్పుకురావటం గమనర్హం.

పల్లె దవాఖానను తనిఖీ చేసిన జాతీయ బృందం



గగ్గలపల్లి దవాఖానలో సిబ్బందితో మాట్లాడుతున్న బృందం సభ్యులు

నాగర్‌కర్నూల్, జూన్ 3 : నాగర్‌కర్నూల్ మండలం గగ్గలపల్లిపల్లిలోని పల్లె దవాఖానను మంగళవారం జాతీయ నాణ్యతా ప్రమాణాల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సేవలపై ఆరా తీశారు. గ్రామంలో క్షేత్రస్థాయిలో ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ఫిబ్రవరి నెలలో జాతీయ నాణ్యతా ప్రమాణాల బృందం వర్చువల్‌గా పరిశీలించింది. ఈ మేరకు మంగళవారం ఆకస్మికంగా జాతీయ నాణ్యతా ప్రమాణాల బృందం సభ్యులు డాక్టర్ శరణప్ప, డాక్టర్ విపిన్ కార్తీక్, గనిగేరు సంయుక్తంగా తనిఖీ చేశారు. ఫిబ్రవరి నెలలో అంచనా వేసిన జాతీయ నాణ్యతా ప్రమాణాల ప్రకారం సేవలను, రికార్డులను క్షేత్ర స్థాయిలో అందుతున్నాయా లేదా అనే దానిపై ఆరా తీశారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మాతాశిశు సంరక్షణ, టీకా కరణ, జీవనశైలి వ్యాధులైన అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రతినెలా అందిస్తున్న మందుల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు నిర్వహిస్తున్న రికార్డులను, ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసిన డేటాను పరిశీలించారు. కాలానుగుణంగా వచ్చే దోమకాటు వ్యాధులు డెంగీ, మలేరియా, కలుషితమైన నీరు ఆహారం ద్వారా వ్యాపించే టైఫాయిడ్, నీళ్ల విరేచనాలు తదితర వాయధుల నివారణ గురించి అవగాహన కలిగించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మంజులావాణి, పెద్దముద్దునూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వాణి, డీపీవో రేణయ్య, ఏవో అనంతచారి, క్వాలిటీ మేనేజర్ సంతోష్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రీతి, డాక్టర్ నీరజ్, ఎంపీహెచ్‌ఈవో ఫసియోద్దీన్ పాల్గొన్నారు.